ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



లక్ష్మణరావును గెలిపించాలని కరపత్ర ప్రచారం చేస్తున్న గంగయ్య, రమాదేవి

లక్ష్మణరావును గెలిపిస్తేనే..

శాసనమండలిలో సమర్థతకు పెద్దపీట

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావును గెలిపించటం ద్వారా శాసనమండలిలో సమర్థతకు పెద్దపీట వేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో అనేకమంది పట్టభద్రులైన ఓటర్లను సిఐటియు నాయకులతో కలిసి రమా దేవి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ ఎన్నో ప్రజా సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి బలమైన ప్రజాతంత్ర ఉద్యమ కర్తగా ఉన్న ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావును తిరిగి గెలిపించాలని కోరారు. బాపట్ల విద్యాకేంద్రంలో లక్ష్మణరావు వంటి సమర్థత కలిగిన నాయకుడిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల కోసం బలమైన సంస్కరణలు అవసరమనే అభిప్రాయంతో ఎన్నో సందర్భాల్లో లక్ష్మణరావు శాసనమండలిలో తన గళాన్ని వినిపించారని ▶ 3లో



లక్ష్మణరావును గెలిపించాలని డాక్టర్ ఈపూరి గణేష్‌ను కోరుతున్న రమాదేవి

మనుషులా..పశువులా.?

- గేదెల తవుడులో భారీగా కల్తీ
- క్వింటా తవుడులో 40 కిలోలు సున్నం, వరిపొట్టు రవ్వ
- రోగాల బారిన పడుతున్న జీవాలు
- వాటి పాలు తాగే ప్రజల ప్రాణాలకూ ముప్పు
- మొక్కుబడిగా అధికారుల దాడులు
- ముడుపులతో దందా యధాతథం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గేదెలకు నీళ్లలో కలిపే తవుడును కూడా కల్తీ చేసే దుర్మార్గపు ఆలోచనలను వ్యాపారులు చేస్తున్నారు. అన్ని వస్తువుల కల్తీ మాదిరిగానే మూగజీవులు తాగే తవుడులోనూ భారీగా కల్తీ కలుపుతున్నారు. వాటి నుంచి వచ్చే పాలను ప్రజలు తాగుతున్నారనే స్పృహను కూడా కోల్పోతున్నారు. కల్తీ తవుడు తిన్నందుకు గేదెల ఆరోగ్యంతో పాటు వాటి పాలు తాగే ప్రజల ప్రాణాలకూ ముప్పు పొంచి ఉంది. ఇటీవల పాలల్లో కల్తీకే జనం హడలిపోయారు. యూరియా, పామాయిల్ మిక్స్‌తో చేసిన కల్తీ పాలను అధికారులు పట్టుకున్నారు. ఇప్పుడు ఏకంగా గేదెలు తాగే నీళ్లలో కలిపే తవుడు సైతం కల్తీగా మారిపోయింది. ఇంతటి ఘోరమైన దందాపై అధికారులూ పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. మొక్కుబడిగా దాడులు నిర్వహించడం, ముడుపులు తీసుకొని వదిలేయడం తంతుగా మారింది. ఫలితంగా కల్తీ తవుడు లక్షల క్వింటాళ్లను పశువులు తినేస్తున్నాయి. చాలా పశువులు పేగులు దెబ్బతిని అంతుచిక్కని రోగాలతో చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.



కల్తీ తవుడు




కల్తీ తవుడును గుర్తించిన వేంపాడులోని రైస్‌మిల్లులో ఓ వైపు షెటర్‌ను సీజ్ చేయని అధికారులు

కల్తీ ఎలా జరుగుతుందంటే..

రైస్‌మిల్లుల నుంచి వడ్లను మర వేస్తే.. తవుడు వస్తుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. దాన్ని అమ్ముకుంటే మిల్లు నడిపే వ్యక్తులు లేదా తయారీదారుడికి కిలోకు రూ.27 వస్తుంది. దాంట్లో ఇతర పదార్థాలు కల్తీ చేస్తే కిలో రూ.19 నుంచి రూ.20 ▶ 3లో

అయ్యో పులి.!



- గాలిలో దీపంలా వన్య ప్రాణుల సంరక్షణ
- గిరిజన గ్రామాల్లోకి తరచూ పులులు, ఎలుగుబంట్లు రాక
- వేటాడుతూ రోడ్లపైకి వచ్చి మృత్యువాత పడుతున్న వ్యాఘ్రాలు
- ఐదేళ్లలో ఐదు పులులు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన పెద్దపులుల అభయారణ్యం శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్). అలాంటి చోటే వాటికి పెను ముప్పు ఎదురవుతోంది. పెరుగుతున్న పులుల సంతతికి తగ్గట్టు ఆవాసం, ఆహార లభ్యత దొరకడం లేదు. వీటి ప్రధాన ఆహార జంతువులైన దుప్పులు, కణుతుల సంఖ్య పెరగకపోగా రోజురోజుకూ వాటి సంఖ్యలో తరుగుదల కనిపిస్తోంది. ఇందుకు అటవీ పరిధిలో వేటగాళ్లు మాటు వేయడం, వారిని కట్టడి చేసే స్థాయిలో సిబ్బంది సంఖ్య లేకపోవడంతో ఎంతో భద్రమైనదిగా భావించే నల్లమలలోనే వాటి సంరక్షణ గాలిలో దీపంలా మారింది. ఈ క్రమంలోనే ఆదివారం యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీ శాఖ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉచ్చులలో చిక్కి ఒక చిరుతపులి బలైంది.



మృతిచెందిన చిరుతపులి

పులుల ప్రధాన ఆహార జంతువుల సంఖ్య పెరగడమూ లేదు. నల్లమల పరిధిలోని మిగతా ప్రాంతాలతో పాటు గిద్దలూరు, మార్కాపురం డివిజన్‌లో వేటగాళ్ల కదలికలు రోజురోజుకూ పెరుగుతుండడమే అందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. అటవీ సమీప గ్రామాల్లో తిష్టవేసిన కొందరు వేటగాళ్లు గడ్డి తినే జంతువులు సంచరించే నీటివనరుల వద్ద, జేడ (సాల్ట్ లీక్) మైదానాల వద్ద ఉచ్చులు వేసి మాటు గాస్తున్నారు. ఆ ఉచ్చులకు చిక్కిన వన్యప్రాణులను మాంసంగా మార్చి పట్టణాల్లో పెద్ద మొత్తానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రమాదకర స్థితిలో పులి..

ఎంతో భద్రమైనదని భావించే ఎన్‌ఎస్‌టీఆర్‌లో ప్రాణాంతక వైరస్‌లా వేటగాళ్ల చొరబాటు పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం సిబ్బంది కొరతేనన్నది విస్పష్టం. ఎన్‌ఎస్‌టిఆర్ సర్కిల్లో మొత్తం నాలుగు డివిజన్లలో 250 మందే సిబ్బంది ఉన్నారు. ఈ అరకొర సిబ్బందితో వేటగాళ్లను నియంత్రించలేని పరిస్థితి. ఫలితంగా పులి సంరక్షణ ప్రమాదకర స్థితిలో పడింది.

వేధిస్తోన్న ఆహార కొరత..

శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న ఆహార లభ్యతను బట్టి ఒక్కో పెద్దపులి తన ఆధీన ప్రాంతం (టెరటరీ)గా సుమారు 40 చ.కి.మీ. పరిధిని ఉంచుకుంటోంది. పులి సాధారణంగా ఆరుసార్లు దాడులు చేస్తే ఒకసారి వేట సాఫల్యమవుతుంది. ఇందుకోసం అది ఆరు రోజులు కూడా ఆకలితో నకనకలాడాల్సి ఉంటుంది. కనీసం వారానికో జంతువును వేటాడినా ప్రస్తుతం నల్లమలలో ఉన్న పులులకు వారానికి సుమారు 90 ఆహార జంతువులు అవసరమవుతాయి. నెలకు 360, సంవత్సరానికి దరిదాపుగా నాలుగు వేలకు పైగా జంతువులు అందుబాటులో ఉండాలి. ఇది కనిష్ట అవసర స్థితి. ఈ నిష్పత్తిలో ఆహార లభ్యత లేకపోతే పులుల అధీన ప్రాంతం క్రమేపీ ▶ 3లో

పోలీసుల వేధింపులు భరించలేక..

ఆత్మహత్యాయత్నం

- పురుగుమందు తాగబోయిన కుమారుడు
- కొడుకు దగ్గర డబ్బా లాక్కొని తాగిన తల్లి
- అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



చికిత్స పొందుతున్న గాలీబీ

ప్రజాశక్తి-పంగులూరు

భార్యాభర్తల వివాదంలో పోలీసులు పెట్టే వేధింపులు భరించలేక తల్లి, కొడుకు ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం సాయంత్రం పంగులూరు వద్ద జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద జరిగింది. మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన షేక్ ఇమామ్, అతని భార్య సాల్మన్ కుటుంబ కలహాల కారణంగా రెండేళ్ల క్రితం నుంచి విడివిడిగా ఉంటున్నారు. వారికి ఏడాదిన్నర వయస్సున్న కుమార్తె ఉంది. తన భార్య కాపురానికి రావాలని ఇమామ్ ఎన్నిసార్లు పెద్ద మనుషుల ద్వారా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. చేసేది లేక ఇమామ్ న్యాయపరంగా విడాకులు కావాలని కోరాడు. ఈ నేపథ్యంలో సాల్మన్ తన భర్త, అత్తతో పాటు వారికి సహకరిస్తున్నారన్న కారణంతో మరో 9 మందిపై రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు వారిపై 498 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ప్రతిరోజూ ఆ తొమ్మిది మందినీ ఎస్ఐ వినోద్‌బాబు స్టేషన్‌కు పిలిచి టార్చర్ పెడుతున్నాడని, అంతటితో ఆగకుండా తనపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఇమామ్ తెలిపాడు. 'నీ భార్య బంగారం ఆమెకి ఇచ్చెయ్.. లేకపోతే నీపై దొంగతనం కేసు పెడతా.. మీ కుటుంబాన్ని రోడ్డుకీడుస్తా.. బంగారాన్ని సీజ్ చేస్తా.. నిన్ను జీవితంలో బయటికి రాకుండా చేస్తా..' అంటూ దురుసుగా మాట్లాడాడని ఇమామ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఎస్సై వినోద్‌బాబు వేధింపులు భరించలేక తాను పురుగుమందు తాగుదామని తెచ్చుకున్న డబ్బాను తన తల్లి గాలీబీ తాగిందని, ప్రస్తుతం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ గొడవ విషయంలో సంబంధం లేని తన చెల్లిని పసిపిల్ల తల్లి అని కూడా చూడకుండా రాత్రి సమయాల్లో స్టేషన్ పిలిచి.. టార్చర్ పెట్టారని, ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరాడు.

టార్చర్ పెట్టలేదు.. : ఎస్ఐ వినోద్‌బాబు

అలవలపాడు గ్రామానికి ▶ 3లో



అర్జీ దారులతో మాట్లాడుతున్న జేసీ

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృషి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల కష్ణ ఆదేశించారు. కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో 'మీ కోసం'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 243 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ, రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, పార్ధసారధి, వరకుమార్, విజయజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై చర్యలు చేపట్టండి : ఎస్పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పి దామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలువైపులా నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులు జిల్లా ఎస్పి, పోలీస్ అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి ఫిర్యాదుదారులతో ముఖా ముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఫిర్యాదులను చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పి

ఈ కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేధింపులు, చీటింగ్/జాబ్ ఫ్రాడ్, భూ వివాదాలు మరియు ఇతర సమస్యలపై ప్రజా ఫిర్యాదులు వచ్చాయి. హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు రజియా సుల్తాన్, ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యానాదులపై దాడి చేసిన వారి అరెస్టు చేయాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ చీమకుర్తి మండలం బక్కిరెడ్డి పాలెం యానాది కాలనీకి కోమరిగిరి వెంకటేశరమ్మ, చలంచర్ల దుర్గ, చేవూరి సుబ్బయమ్మపై అదే గ్రామానికి చెందిన పెత్తందారీ కులస్తులు ఇస్తాలముడి సుబ్బులు, ఆమె చెల్లెళ్ళు ముగ్గురు కలిసి ఈనెల 14న కళ్లలో కారం చల్లి కర్రలతో దాడి చేసిన్లటు తెలిపారు. అనంతరం పెత్తందారీ కులస్తులు ఫిర్యాదు చేయటంతో పోలీసులు యానాదులపై తప్పుడు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పేరం సత్యం, బహుజన నాయకులు ఇస్తర్ల శంకర్ బహుజన్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు చింతలపాలెం యలమంద బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి రవి , బక్కిరెడ్డిపాలెం గ్రామ గిరిజన ప్రజలు కోమరిగిరి నారాయణ, చలం చర్ల అంజయ్య, యంగయ్య, తోకల కిట్టు, వరాలు, కత్తిభవాని, భవాని, అంకమరావు, సంజీవులు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న నాయకులు

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించ ుకోవాలని ముస్లిం ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. వక్ఫ్ బిల్లు ఉపసంహరించాలని, పాత బిల్లును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సెంటర్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పఠాన్ కరిముల్లా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మార్చి 10న నుంచి పార్లమెంట్ సమావేశాలలో వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ బిల్లు ప్రక్రియపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా, ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదింప జేసుకోవాలనే యోచిస్తుందన్నారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా వున్న కూటమి ప్రభుత్వం బిజెపి తలపెట్టిన వక్ఫ్ సవరణ చట్ట ప్రక్రియను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయవాది కరీముల్లా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముస్లింలకు పెద్దన్నగా ఉంటానని ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన వాగ్ధానాన్ని నిలబెట్టుకునే సమయం వచ్చిందని గుర్తు చేశారు. ముస్లిం మనోభావాలను కాపాడాల్సిన భాద్యత టిడిపిపై ఉందన్నారు. సవరణ బిల్లు ఓటింగ్‌లో పాల్గొనకుండా కూటమి సభ్యులను కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ రఫీ, సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ గత ఎన్నికలలో ముస్లింలు తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. ముస్లింల సమస్యలపై అండగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాలు, ఆవాజ్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి, ముస్లిం సంక్షేమ సంఘాల నాయకులు షేక్ అమీర్,మహమ్మద్ ఆషిక్, పఠాన్ మసూద్ ఖాన్ ,పటాన్ రహమాన్ ఖాన్, షేక్ షబ్బీర్,షేక్ రహమాన్, సయ్యద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నా రు..

దావా సమను

సి.పి.సి. ఆర్డర్ 5 రూల్ 1 మరియు 5)

మహారాజశ్రీ

మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం: 128/2024

State Bank of India, Main Branch, Markapur, Rep. by it's Chief Manager.
.... Plaintiff
Vs
Ganrenpudi Victoriyamma & Adimulapu Krupadanam having died their LRs
1.Adimulapu Joy Kayeela Percis and others .... Defendants

To

D1 :- Adimulapu Joy Kayeela Percis, Aged 41 years, D/o.Late Krupadanam,
D2 :- Adimulapu Joy Neheela Percis, Aged 45 years, D/o.Late Krupadanam,
D3 :- Adimulapu Joy Haveela Percis, Aged 50 years, D/o.Late Krupadanam,
D4 :- Adimulapu Joy Shefeela Percis, Aged 47 years, D/o.Late Krupadanam,
All are Christians and Residents of SC Palem, Gajjalakonda Village, Markapur Mandal, Prakasam District.

పై నెంబరు దావాలోని వాది/బ్యాంకు, దావా పరిహారం నిమిత్తం అనగా మీ తల్లి గారైన Ganrenpudi Victoriyamma వాది/బ్యాంకు నందు తీసుకున్న లోన్ బాకీని గూర్చి మీ పైన పై కోర్టులో, పై నెంబరున వాది/బ్యాంకు దావా దాఖలు చేసియున్నందున, ఇందువిషయమై మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా, అవి మీకు ముట్టని కారణము చేత ఈ దినపత్రిక దావా సమను ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా 20-02-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియ జేసుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 20-02-2025 **కె.అచ్చిరెడ్డి**
మార్కాపురం **న్యాయవాది.**

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No : 809/2020

IN

O.S.No : 370/2020

బోయిళ్ల ఆదిలక్ష్మమ్మ వగైరాలు
..పిటిషనర్లు / వాదులు
వర్సస్
బోయిళ్ల శింగర రెడ్డి వగైరాలు
..రెస్పాండెంట్లు / ప్రతివాదులు

To

రెస్పాండెంట్లు / ప్రతివాదుల చిరునామా

R2)బోయిళ్ల రమణ రెడ్డి తండ్రి శింగర రెడ్డి, హిందూ, వ్యవసాయం, 50 సంవత్సరాలు, సూరావారి పల్లి గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

R4)బోయిళ్ల జనార్దన్ రెడ్డి తండ్రి శింగర రెడ్డి, హిందూ, వ్యవసాయం, 39 సంవత్సరాలు, సూరావారి పల్లి గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్లు / వాదులు మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు పిటిషన్‌లో మీరు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 24-02-2025న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీరు ఆక్షేపణలుంటే తెలుపు కునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 16-02-2025 **ఇట్లు**

శ్రీ పి.యన్.శేషశయనా రెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు,
ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

దావా సమను

(ఆర్డర్ 5, రూల్ 1 & 5)

మహారాజశ్రీ రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం.316/2024

బిట్వీన్ :
వడ్డి లక్ష్మోజి ...వాది
మరియు
గోకనకొండ పౌల జన్నిఫర్ మరియు ముగ్గురు
....ప్రతివాదులు

టు:

ప్రతివాదులు :

1) గోకనకొండ పౌల జన్నిఫర్, భర్త లేటు సుజ్ఞానసింహ, వయస్సు 50 సం., గృహిణి, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లె జె.సి.జె.సి.
2) గోకనకొండ గిరిజ కల్వరి పురఫ్ కల్వరి గిరిజ, తండ్రి లేటు సుజ్ఞానసింహ, వయస్సు 27 సం., ప్రవేటు ఉద్యోగం, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు. రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా. రేపల్లె జె.సి.జె.సి.
3) గోకనకొండ సారాజయ, తండ్రీ లేటు సుజ్ఞానసింహ, వయస్సు 25 సం., ప్రవేటు ఉద్యోగం, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లె జె.సి.జె.సి.
4) గోకనకొండ పౌల సుజ్ఞాన, తండ్రి లేటు సుజ్ఞానసింహ, వయస్సు 22 సం., విద్యార్థి, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లె జె.సి.జె.సి.

పై నెంబరు దావాను పై కోర్టునందు వాది దాఖలు చేసుకొనగా సదరు దావాలో ప్రతివాదులు అయిన మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.12-03-2025కు ఉన్నది. కావున మీరు ఆ రోజు అనగా ది.12-03-2025 ఉదయం గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టులో మీరు ప్రత్యక్షంగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని హాజరై మీ అక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ గౌరవ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం //

వాయిదా తేదీ :12-03-2025.

బొర్రా వెంకటేశ్వరరావు.
వాది తరుపు న్యాయవాది.
రేపల్లె

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 370/2020

బోయిళ్ల ఆదిలక్ష్మమ్మ వగైరాలు .. వాదులు
వర్సస్
బోయిళ్ల శింగర రెడ్డి వగైరాలు .. ప్రతివాదులు

To

ప్రతివాదుల చిరునామా

D2)బోయిళ్ల రమణ రెడ్డి తండ్రి శింగర రెడ్డి, హిందూ, వ్యవసాయం, 50 సంవత్సరాలు, సూరావారి పల్లి గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

D4)బోయిళ్ల జనార్దన్ రెడ్డి తండ్రి శింగర రెడ్డి, హిందూ, వ్యవసాయం, 39 సంవత్సరాలు, సూరావారి పల్లి గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాదులు మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుటకుతేదీ:24-02-2025న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 16-02-2025

ఇట్లు
శ్రీ పి.యన్.శేషశయనా రెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు,
ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

నోటీసు

మహారాజశ్రీ రేపల్లె ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 595/2024

ఇన్

ఓ.యస్.నెం.316/2024

బిట్వీన్ :
వడ్డి లక్ష్మోజి ...పిటీషనర్/వాది
మరియు
గోకనకొండ పౌల జన్నిఫర్ మరియు ముగ్గురు
....రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

టు :

రెస్పాండెంట్స్/ ప్రతివాదులు :

1) గోకనకొండ పౌల జన్నిఫర్, భర్త లేటు సుజ్ఞానసింహ, వయస్సు 50 సం., గృహిణి, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లె జె.సి.జె.సి.
2) గోకనకొండ గిరిజ కల్వరి పురఫ్ కల్వరి గిరిజ, తండ్రి లేటు సుజ్ఞానసింహ, వయస్సు 27 సం., ప్రవేటు ఉద్యోగం, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లెజె.సి.జె.సి.
3) గోకనకొండ సారాజయ,తండ్రి లేటు సుజ్ఞానసింహ, వయస్సు 25 సం., ప్రవేటు ఉద్యోగం, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లెజె.సి.జె.సి.
4) గోకనకొండ పౌల సుజ్ఞాన, తండ్రి లేటు సుజ్ఞానసింహ, వయస్సు 22 సం., విద్యార్థి, డోర్ నెం.11-15-75/2, రాజేష్ థియేటర్ దగ్గర, 10వ వార్డు, రేపల్లె పట్టణం మరియు మండలం, బాపట్ల జిల్లా, రేపల్లెజె.సి.జె.సి.

పై నెంబరు పిటీషన్ లోని పిటీషనర్/వాది పైనెంబరు దావాలో ఐ.ఎ. నెం. 595/2024రును పై కోర్టునందు దాఖలు చేసుకొనగా సదరు ఐ.ఎ.లో రెస్పాండెంట్స్/ప్రతివాదులు అయిన మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.12-03-2025కు ఉన్నది. కావున మీరు ఆ రోజు అనగా ది.12-03-2025 ఉదయం గం.10-30ని.లకు పై తెలిపిన కోర్టులో మీరు ప్రత్యక్షంగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని హాజరై మీ అక్షేపణలు తెలియ జేయవలెను. లేనియెడల సదరు పిటీషను మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ గౌరవ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం //

వాయిదా తేదీ : 12-03-2025.

బొర్రా వెంకటేశ్వరరావు
పిటిషనర్ /వాది తరపు
న్యాయవాది, రేపల్లె

లారీని ఢీకొన్న కారు

వ్యక్తి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

మార్టూరు సమీపంలో ప్రమాదం

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

చెల్లి వద్దకు వెళ్లి వస్తున్న ఇద్దరు అన్నదమ్ములు, మరొక సమీప బంధువు తిరుగు ప్రయాణంలో మార్టూరు వద్ద జరి గిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, 108 సిబ్బంది మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో శ్రీ శ్రీనివాస మెడికల్ షాపు నిర్వహిస్తున్న జూలూరి శ్రీకష్ణ (32) తన సోదరుడు జూలూరి వంశీ, బావ కొప్పరావురి వివేక్‌తో కలిసి బెంగళూరులో నివాసం ఉంటున్న చెల్లి వద్దకు వెళ్లి అక్కడ ఉన్న తమ కొత్త కారు తెచ్చుకోవడానికి వెళ్లారు. ఇటీవల నూతనంగా కొనుగోలు చేసిన సఫారీ కారులో నూజివీడుకి తిరిగి వస్తుండగా మార్టూరు సమీపంలోని దుర్గా మల్లేశ్వరి కళ్యాణ మండపం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని దట్టమైన పొగ మంచు కారణంగా గుర్తించక బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో కారు నడుపుతున్న వంశీ, ముందు సీట్లో కూర్చున్న వివేక్ తీవ్రంగా గాయపడ్డారు. మధ్య సీట్లో నిద్రపోతున్న శ్రీకష్ణ ప్రమాద తీవ్రతకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జు నుజ్జు ఐనప్పటికీ ముందు వైపు ఉన్న రెండు ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో వంశి, వివేక్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న 108 వాహనం ఈఎంటి మనోహర్ ప్రమాద స్థలికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఇద్దరు క్షతగాత్రులను చిలకలూరిపేటలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు. సిఐ శేషగిరిరావు తన సిబ్బందితో రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా పర్యవేక్షించారు. కారులో ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన శ్రీకృష్ణ



ప్రమాదంలో ధ్వంసమైన కారు

మనుషులా..పశువులా.?

(మొదటిపేజీ తరువాయి)

పడుతుంది. ఇక్కడే క్వింటాకు రూ.7 వేల నుంచి రూ.8 వేలు లాభం ఆర్జిస్తున్నారు. అందుకు కొన్ని మార్గాలు ఎంచుకున్నారు. వెయ్యి క్వింటాళ్ల కల్తీతౌడును పరిశీలిస్తే దాంట్లో మిల్లు నుంచి వచ్చిన అసలైన తవుడు 600 క్వింటాళ్లు ఉంటుంది. దీన్ని రాశిగా పోసి అందులో పిడుగురాళ్ల నుంచి తెచ్చిన సున్నం 200 కిలోలు కలుపుతారు. చెన్నై నుంచి తెచ్చే వరిపొట్టు రవ్వను మరో 200 కిలోలు కలిపి మొత్తం మిశ్రమంగా కలుపుతారు. ఇది మెత్తగా ఉంటుంది. తెల్లగా చూడ్డానికి ఆకర్షనీయంగా ఉంటుంది. దీన్ని కిలో రూ.27కు వ్యాపారులకు అమ్ముతారు. వ్యాపారులు దీన్ని రైతులకు కిలో రూ.33కు అమ్ముతున్నారు. ఈ కల్తీ ప్రక్రియ వల్ల తయారీదారులు కిలోకు అదనంగా రూ.7 లేదా రూ.8 అదనంగా లాభం పొందుతున్నారు. వ్యాపారులు కూడా దాన్ని రూ.27 కొని రూ.33లకు అమ్మడం వల్ల రూ.6 లాభం పొందుతున్నారు. దీని వల్ల పశువుల ఆరోగ్యం పోతుందని, వాటి పాలు తాగడం వల్ల జనం ఆరోగ్యాలు పోతాయని తెలిసినా దందాను యథేచ్ఛగా చేస్తున్నారు.

రైస్ మిల్లులే కల్తీ కేంద్రాలుగా..

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 30 మండలాల్లో కల్తీ తవుడును తయారుచేస్తున్నారని సమాచారం. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలం వేంపాడు, పర్చూరు, చీరాల, సంతనూతలపాడు, అద్దంకి ప్రాంతాలతో పాటు వినుకొండ కేంద్రంగా ఈ కల్తీ తవుడు తయారవుతోంది. నెలకు లక్ష టన్నులకు పైగానే కల్తీ తవుడు తయారవుతున్నట్లు అంచనా. కొన్ని మిల్లులు కల్తీ తవుడును తెప్పించుకొని.. మంచి తవుడుగా విక్రయిస్తున్నారు. స్థానిక కార్మికులైతే వేతనాలు అధికంగా ఇవ్వడంతో పాటు కల్తీ విషయం బయటపడుతుందని, తెలుగు భాష రాని ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులతో తక్కువ వేతనాలకు ఇక్కడ రైస్‌మిల్లుల్లో పనిచేయించుకుంటున్నారు. కార్మిక శాఖ కూడా ఈ కార్మికుల వేతనాల గురించి, వారి సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. ఈ కార్మికులను గుర్తించి.. వారికి సరైన వేతనాలు, వసతులు ఇప్పించేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కల్తీ తవుడు విషయంపై పశు సంవర్ధక శాఖ జేడీ బేబీ రాణిని వివరణ కోరగా తవుడు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ విషయంపై విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు.

మొక్కుబడిగా దాడులు..

పశుసంవర్ధక శాఖ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు, తూనికలు కొలతలు, సేల్స్ టాక్స్, లేబర్ డిపార్టుమెట్ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తున్నారు. వీరు తనిఖీలు సక్రమంగా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మిల్లుల యజమానుల వద్ద ముడుపులు తీసుకొని కేసులు, చర్యలు తీసుకోవడంలో కఠినంగా ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు ముండ్లమూరు మండలం వేంపాడులో 700 బస్తాల తవుడును సీజ్ చేశారు. తవుడు ఉంచిన మిల్లుకు ఉన్న అన్ని ద్వారాలకూ సీల్ వేయలేదు. రెండు ద్వారాలకు వేసి మరో ద్వారానికి వేయకుండా వదిలేశారు. అంటే దాన్ని యజమానులు సరిచేసుకోవాలని చెప్పడమా? లేక కారణం ఏమిటో ఆలోచించాలని రైతులంటున్నారు. పైగా మిల్లును లీజుకు తీసుకున్న వారిపై చర్యలు లేవు. ఇలా అధికారుల తీరుపై చర్చ సాగుతోంది.

గేదెలు, ప్రజల ప్రాణాలకు ముప్పు

తవుడులో సున్నం కలపడం వల్ల కాల్షియం అధికమై పశువుల ఆరోగ్యం దెబ్బ తినే ప్రమాదం ఉంది. పొట్టలోని పేగులకు చిల్లులు పడతాయి. అనేక రకాల వ్యాధుల బారినపడతాయి. పైగా వీటినుంచి వచ్చే పాలను తాగిన జనాలకూ ఆరోగ్య సమస్యలు తప్పవు. వైద్యశాఖ కూడా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.


దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి: రైతుసంఘం

కల్తీ తవుడు కేంద్రాలపై అధికారులు దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధికారులను కోరారు. జిల్లాలో అనేక ప్రాంతాలతో పాటు వినుకొండ కేంద్రంగా ఈ కల్తీ తవుడు తయారవుతున్నట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. సున్నం కలిపిన తవుడు గేదెలకు పెట్టడం వల్ల కాల్షియం పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి పాలు తాగిన జనం కూడా అనారోగ్యం పాలవుతారన్నారు. దాడులు సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వున్నాయన్నారు. అధికారులు స్పందించి కల్తీ తవుడు తయారీపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాపట్లకు చెందిన మెంద్రాగుత్తి రుద్ర దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. భర్త గతంలోనే చనిపో యారు. రుద్ర ఇద్దరు కూతుర్లతో పూట గడవక ఇబ్బంది పడుతున్నారు. చిన్న కూతురు కూడా చర్మవ్యాధితో బాధపడుతోంది. చిరు వ్యాపారం కోసం ఒంగోలులోని సూర్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్‌ను కలిసి సాయం చేయాలని రుద్ర కోరారు. స్పందించిన చైర్మన్ షాహనాజ్ ప్రవాస భారతీయుడు పోలవరపు అనిల్‌తో మాట్లాడి వారి సహకారంతో ట్రస్టు కార్యాలయంలో సోమవారం నాడు రూ.30 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్: ఎన్టీఆర్ విగ్రహానికి మసి పూసి అవమానపరచిన గుర్తు తెలియని అగంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ఆర్గనై జింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, పట్టాణ అధ్యక్షులు కామినేని జనార్ధన్, టిడిపి కార్యకర్తలతో కలిసి పట్టణ టిడిపి కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో సత్కరించారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్టూరు సీఐని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరావు,కమ్మ శివ నాగేశ్వరరావు, ముప్వ సాంబశివ రావు,కొర్రపాటి హరినాథ్ బాబు, గొట్టిపాటి వెంకటరావు,కన్నెగంటి శీను, షేక్ మస్తాన్ వలీ, గన్నవరం బుడే, గుర్రం శ్రీనివాసరావు,మద్దు అనిల్ కనమర్లపూడి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపిస్తేనే..

శాసనమండలిలో సమర్ధతకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. అధికార కూటమి ఎన్ని ఎత్తుగడలు వేసినా లక్ష్మణరావు వంటి నాయకుడు అవసరమనే విషయాన్ని గుర్తిస్తూ అనేక ప్రాంతాల్లో పట్టభద్రులు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని చెప్పారు. ఇది విజయానికి సంకేతంగా పేర్కొన్నారు. మండలిలో బలమైన ప్రజావాణి వినిపించాలంటే లక్ష్మణరావును ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉమ్మడి గుంటూరు, కష్ణా జిల్లాల్లో ప్రజల సమస్యల పట్ల అవగాహనతో, బాధ్యతతో పనిచేసే నిజాయతీ గల నాయకుడు లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క పట్టభద్రుడూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య, సిఐటియు సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి మండలంలో విస్తత ప్రచారం

చెరుకుపల్లి: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రచారం నిర్వహించారు. సోమవారం చెరుకుపల్లి, గుల్లపల్లిలో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులను కలిసి లక్ష్మణరావుని గెలిపించాలని కోరారు. గుల్లాపల్లిలో రేపల్లె వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్‌ని కలిసి ప్రజాసమస్యల పట్ల నిరంతరం శ్రమించే డాక్టర్ లక్ష్మణరావు గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.శరత్, కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వేధింపులు భరించలేక..ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఇమామ్‌ను తామెప్పుడూ టార్చర్ పెట్టలేదని, కొట్టలేదని, తిట్టలేదని రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య ఉన్న గొడవలను కోర్టు ద్వారా గానీ, పెద్దమనుషుల ద్వారా గానీ పరిష్కరించుకోవాలని కోరానని చెప్పారు. తన భార్య తనకు కావాలని ఇమామ్ కోరినా అతని భార్య అందుకు సిద్ధంగా లేదని, దానికి పోలీసులమైన తాము ఏమి చేయగలమని అన్నారు. తాను అందరికీ న్యాయం చేయాలనే సంకల్పంతోనే పని చేస్తున్నాన, ఎవరినీ టార్చర్ పెట్టలేదని చెప్పారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్ కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా కోడూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పరిశ్శా భార్గవ్ (26) ఇటీవల గొర్రెలు మేపుకునే నిమిత్తం కనగాల వచ్చారు. ఈ నెల 15వ తేదీన మద్యం తాగి అనంతరం పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి పరిశా బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన కుమారుడు భార్గవ్‌కు ఒక సంవత్సరం క్రితం వివాహం జరిగిందని, అప్పుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పందిళ్ళపల్లి జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి ఇసుక అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వేటపాలెం ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తరలిస్తుండగా కేసు నమోదు చేశారు.

అయ్యో పులి.!

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతుంది. దీంతో పులుల మధ్య ఆహారం కోసం యుద్ధాలు జరుగుతాయి. ఈ పోరులో ఎన్నో పులులు మరణించే అవకాశం ఉంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో పులి ఆహారం వేటగాళ్ల చౌర్యానికి గురైతే జరిగే నష్టం లెక్కకట్టలేనిది.

నీళ్ల కోసం అటవీ సమీప ప్రాంతాలకు..

ఆహారం, నీళ్ల కోసం ఇవి తరచూ ఆటవీ సమీప ప్రాంతాలకు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వన్యప్రాణులను వేటాడుతూ జనావాసాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు, పశువుల కాపర్లు, పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి కూలీలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న పెద్దదోర్నాల, పుల్లల చెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్థవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో ఉన్న అటవీ సమీప గ్రామాల నుంచి పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గేదెలు, అవులు, ఎద్దులపై దాడిచేసి తింటున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని బొమ్మలాపురం, వై.చర్లోపల్లి, నల్లగుంట్ల, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, ఘాట్‌రోడ్డు, అర్థవీడు మండలంలోని గన్నెపల్లి, లక్ష్మీపురం, మాగుటూరుతాండ, వెలగలపాయ, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండుచర్ల తదితర గ్రామాల శివార్లలో నాలుగు నెలల వ్యవధిలో చిరుతలు, పెద్దపులులు వచ్చి 20కి పైగా గేదెలు, ఎద్దులను హతమార్చాయి. ఇదే సమయంలో గిద్దలూరు-నంద్యాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రాత్రిపూట చిరుతలు, పెద్దపులులు వచ్చి రైలును ఢీకొని మత్యువాత పడుతున్నాయి. ఆహారం, నీళ్ల కోసం రోడ్లపైకి వచ్చి వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. వీటితో పాటు పొలాల్లో రైతులు అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి చనిపోతున్నాయి.

చనిపోతున్న పులులు, చిరుతలు..

- 2025 ఫిబ్రవరి 16న యర్రగొండడపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీ కార్యాలయం పరిధిలోని నల్లమల అడవిలో వేటగాళ్ల ఉచ్చులు చిక్కుకొని చిరుత మృతి చెందింది.
- 2024లో అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలో విద్యుత్ కంచె తగిలి చిరుత మతి చెందింది.
- 2023 నవంబరు 10న శ్రీశైలం ఘాట్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మతి చెందింది. అదే ఏడాది రోడ్డు దాటుతున్న ఏడాదిన్నర వయస్సున్న చిరుతపులి పిల్ల గుర్తు తెలియని వాహనం ఢీకొని మత్యువాత పడింది.
- 2022 జనవరి 6న దోర్నాల మండలం రోళ్లపెంట సమీపంలో బావిలో పడి చిరుతపులి మతి చెందింది.
- 2021 నవంబరు 12న గిద్దలూరు-నంద్యాల మధ్య చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తూ రైలు కిందపడి పెద్దపులి మతి చెందింది.
- 2020 ఏప్రిల్‌లో యర్రగొండపాలెం సమీపంలోని గాలికొండ ఆటవీ ప్రాంతంలో వద్యాప్యంతో తీవ్రమైన ఎండ వేడిమి తట్టుకోలేక పెద్దపులి మతి చెందింది.

ప్రాజెక్టులను పూర్తి చేయాలి

అఖిలపక్ష సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-మేదరమెట్ల

రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెలలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో కొరిశపాడులోని ఎర్రం చిన్న పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం, తమ్మవరం 2 ప్రాజెక్టులకు సంబంధించి నిధులను కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని, తూర్పు పాలెం భూము లకు కొత్త భూమి విలువలతో కూడిన నష్టపరిహారం చెల్లించాలని, బడ్జెట్లో 200 కోట్లకు పైగా నిధులు కేటాయించాలని అఖిలపక్షం సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. తగిన ప్రణాళికతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలసి రెండు ప్రాజెక్టుల పూర్తి కావడానికి సహకరించాలని కోరాలని నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వాలు వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు అప్పగించాలని చూస్తుందన్నారు. కొరిసపాడు పోలిరెడ్డి ఎత్తిపోతల పథకంలో ముంపుకు గురి అవుతున్న తూర్పుపాలెం, ఎస్టీ కాలనీ, మరియు వెనుకబడిన తరగతుల వారు ఉండే ఇళ్లకు ఆర్‌ఆర్ ప్యాకేజ్ మరియు ల్యాండ్ అక్విటేషన్‌కు ప్రస్తుతం ఉన్న భూమి భూమి విలువ ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు మండలాలలో సుమారు 25 వేల ఎకరాలు సాగులోకి వచ్చి సస్యశ్యామలంగా ఉండేది అన్నారు. కొరిశపాడు నీటి సంఘం మాజీ అధ్యక్షులు లేళ్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి మూడు మండలాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. పంట సాగు చేయక రైతులు ఎంతో నష్టపోయి ఉన్నారన్నారు. పంట నష్టపరిహారాన్ని కూడా వెంటనే చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు చెన్నుపాటి హరిబాబు, నాతని హనుమంతరావు, కోనంనేని నాగార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోనంనేని హనుమంతరావు, శివారెడ్డి, రాజా, బెల్లం వీరయ్య, ఎస్. కోటేశ్వరరావు, వై.రవీంద్రబాబు, టి.శ్రీనివాసరావు, సర్దార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌గా మార్పునకు ప్రతిపాదిస్తా

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-వేటపాలెం

ఎంపియుపిఎస్ స్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చటానికి ప్రతిపాదిస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అక్కయ్యపాలెం పంచాయతీ యానాది సంఘం ఎంపియుపిఎస్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. స్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చటానికి కావాల్సిన ప్రతిపాదనను ఇంజనీరింగ్ శాఖ వారిచే తయారు చేయించి ఎంఈఓ ద్వారా పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఆటస్థలం సేకరణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్ బాబు, ఎంఈఓ పురుషోత్తం, టిడిపి నాయకులు జంగిలి వెంకట రామారావు, పంచాయతీ సెక్రెటరీ గౌస్ మొహిద్దిన్ అలీ, స్థానిక నాయకులు, పాఠశాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. పందిళ్ళపల్లి గ్రామంలో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. చల్లారెడ్డి పాలెం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

నేటి నుంచి అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ డి సుధా తెలిపారు. మొదట విడతగా ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు అనగా మూడు రోజులపాటు జరుగుతాయన్నారు. సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 35 మందికి, ఏల్చూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మందికి, అలాగే బల్లికురవ మండలంలోని బల్లికురవ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 32 మందికి, కొప్పెరపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 32 మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అలాగే జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ విడత శిక్షణా ఈనెల 22వ తేదీ నుండి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు ఐసిడిఎస్ మరియు విద్యాశాఖ నుండి ఎస్ జి టి లు పాల్గొంటారన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విలేకరిపై దాడిని ఖండించిన జర్నలిస్టులు

ప్రజాశక్తి-బాపట్ల

మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడికి పాల్పడ్డ గుల్ల వేణు గోపాల్ నాయుడును కఠినంగా శిక్షించాలని కోరుతూ బాపట్ల జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్, బాపట్ల జిల్లా జర్నలిస్టులు సోమవారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళికి వినతిపత్రం సమర్పించారు. విలేకరి పై జరిగిన దాడిని ఖండిస్తూ బాపట్ల జిల్లా జర్నలిస్టల నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రంపై సంతకాలు చేసిన వారిలో జర్నలిస్టులు జయప్రకాష్, వేజెండ్ల శ్రీనివాసరావు, బత్తుల సురేష్, బండ్రెడ్డి గోపి, సుభాని, చీమలదిన్నె నారాయణ, బక్కా దీపక్, కత్తి రాజు ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని పూనూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రం సోమవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమములో ఏడీఏ మోహనరావు మాట్లాడుతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. ఏడీపీయం మోహన్ మాట్లాడుతూ రైతులకు కావలసిన అన్ని రకాల కాషాయాలు, ద్రావనాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఒ మేరిమ్మ, ఎంటీ వెంకటేశ్వర్లు, యూనిట్ ఇంచార్జులు ఎ.కోటిబాబు, యం.వెంకటరత్నం, ఐ.సి.ఆర్.పిలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

వాడరేవులో మత్స్యకార కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-చీరాల

పొట్టకూటి కోసం సముద్రపు వేటకు వెళ్లి వేటసాగించే క్రమంలో ఈ నెల 2వ తారీకున పలువురు మత్స్యకారులతో కలిసి వేటకు వెళ్లిన ఓసిపిల్లి రమణ (57) అనే వాడరేవు గ్రామానికి చెందిన మత్యకారుడు ప్రమాదవుశాత్తు సముద్రంలో జారిపడి గల్లంతై మృతి చెందిన సంగతి పాఠకులకు తెలిసిందే. అయితే ఈ ఘటనలో 15 రోజులైనప్పటికీ మృతదేహం కూడా లభ్యం కాకపోవటంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పరామర్శించి వారిని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకొని ఆ కుటుంబానికి అండగా ఉంటాము అన్నారు.కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని వెంటనే వెలికి తీసి కుటుంబ సభ్యులకు అందజేయాలని వారిని ఆదేశించారు.ఆయన వెంట గ్రామ పెద్దలు,పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

సిఐటియు ఆధ్వర్యంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-బాపట్ల

ఆప్కాస్‌ను కొనసాగించి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా సిఐటియు కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ బాపట్ల కమిటీ జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. మజుందార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేయాలనే చర్చ మంత్రివర్గంలో జరిగినట్టుగా ప్రచారం జరుగుతుందన్నారు. అదే జరిగితే లక్షలాది మంది ఉన్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుందన్నారు. బాపట్ల పట్టణ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు ఓ.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం తన చర్యను విరమించుకోవాలని లేనిపక్షంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమిష్టిగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితి 62 యేళ్లకు పెంచి, (ఎంటిఎస్) మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి-పంగులూరు: లోకోస్ యాప్‌పై సోమవారం పంగులూరులోని కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ యాప్ ద్వారా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎస్ హెచ్ జి గ్రూపుల యొక్క ఆర్థిక లావాదేవీలు, గ్రామ సమైఖ్య లావా దేవీలు, మండల సమైక్య లావాదేవీలు ఒకే విధంగా ఉండేటట్లు చేస్తుందని అన్నారు. యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలో బిఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, వివో ఏలు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు అద్దేపల్లి ఉర్దూ పాఠశాల సమీపంలో గత వారం రోజుల క్రితం త్రాగునీటి సమస్య పరిష్కారానికి తీసిన గుంటను వదిలివేయడంతో నీరు వృథాగా పోతోంది. దీని కారణంగా అద్దేపల్లి గ్రామస్తులకు త్రాగునీరు సమస్య ఏర్పడింది. పంచాయతీ అధికారులు పైపులైను మరమ్మతుల కోసం ఈ ప్రాంతంలో గుంటను తీసి దానిని మరమ్మతులు చేపట్టకుండానే వదిలేశారు. ఈ పైపులైను గతంలో మురుగు నీరు పారే ప్రాంతంలో ఉండటంతో మరమ్మతుల కోసం తీసిన గుంట ద్వారా త్రాగునీరు కలుషితమవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు



వృథాగాపోతున్న తాగునీరు

మాట్లాడుతూ మరమ్మత్తులు చేపట్టేందుకు తీసిన గుంటలో ఒక ప్రక్క పైపులైను ఇప్పటికే మరమ్మతు చేపట్టడం జరిగిందని, రెండవది కూడా మంగళవారం ఉదయం కల్లా పూర్తి చేసి ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-భట్టిప్రోలు: ఆరోగ్యమే మహాభారతి అనే నినాదాలు ప్రతి ఒక్కరు గుర్తించి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరోగ్య భారతి కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆరోగ్యం పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలన్నారు. దీనివలన విద్యా



మాట్లాడుతున్న విష్ణుప్రసాద్

ర్థులలో మానసిక స్థైర్యం పెరగడమే కాక శారీరకంగా ఉల్లాసంగా ఉండి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎఫ్ఏ సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరాం ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సెమినార్‌ను జయప్రదం చేయండి


వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపక నేత, ప్రజా పోరాట యోధులు మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న సెమినార్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సెమినార్ సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నులకు వరాలు చూపి, సామాన్యులపై భారాలను మోపిందన్నారు. ఆ అంశాలను చర్చ చేసి బడ్జెట్లో గ్రామీణ పేదలకు నిధులు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్ గ్రామీణ పేదలపై ప్రభావం అనే అంశంపై ఈ నెల 22న ఎల్‌బిజి భవన్‌లో ఉదయం 10-30 గంటలకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు ప్రధాన వక్తగా హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా సంఘ సీనియర్ నాయకులు జాలా అంజయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్‌కె.మాబు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వూసా వెంకటేశ్వర్లు, కెజి.మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధికి కృషి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చేనేత కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. చేనేత కుటుంబాల జీవన స్థితి గతులను మెరుగు పరిచేందుకు తీసు కోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముద్ర పథకం కింద చేనేత కుటుం బాలకు చేయూత అందించేందుకు 1,044 మందికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 76 మందికి మాత్రమే ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. మండలాల వారీగా చేనేత కుటుంబాల సర్వే జరిగిందన్నారు. జిల్లాలో 7,794 చేనేత కుటుంబాలు ఉండగా అందులో 7,217 కుటుంబాలు యాక్టివ్ గాను 581 కుటుంబాలు ఇనాక్టివ్‌గా ఉన్నాయని సర్వే నివేదిక ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కుటుంబాలు 18 బ్యాంకుల పరిధిలోకి వస్తాయని ఎల్‌డిఎం జిల్లా కలెక్టర్‌కు వివరించారు. 18 బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లకు, గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు, చేనేత జౌళి సహాయ సంచాలకులకు సర్వే రిపోర్ట్ ను అందజేయాలని డిఎల్‌డిఒ అధికారులను ఆయన ఆదేశించారు. సర్వే నివేదిక ప్రకారం రుణాలు మంజూరుకు చర్యలు తీసు కోవాలన్నారు. రుణాలు మంజూరులో ఆయా చేనేత కుటుంబాలను తనిఖీ చేసినప్పుడు అక్కడ మగ్గాలు లేవని ఎల్‌డిఎం కలెక్టర్ కు వివరించారు. మగ్గాలు లేని కుటుంబాలు చేనేతకు సంబంధించి ఇతర వృత్తిలో ఉన్నారో తెలుసుకొని వారికి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్‌డిఎం శివకష్ణ, డిఆర్‌డిఎ పీడీ పద్మ, బాపట్ల డిఎల్‌డిఒ సిహెచ్ .విజయలక్ష్మి, డి.ఎల్‌డిఒ పద్మావతి పాల్గొన్నారు.


బూచేపల్లిని సన్మానిస్తున్న రామకృష్ణ

బూచేపల్లిని కలిసిన రామకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చుంచు రామకృష్ణ వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.. చీమకుర్తిలోని బూచేపల్లి నివాసానికి వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. బూచేపల్లిని కలిసిన వారిలో వైసిపి బీసీ విభాగం రాష్ట్ర నాయకులు బొట్లా రామారావు, జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ సురేష్, జిల్లా నాయకులు తొట్టెంపూడి సురేష్, కుట్టుబోయిన కోటి, ఫణిదపు సుధాకర్, సురేష్, ఉలిచి గ్రామ సర్పంచి మంచు మురళి, ఎంపిటిసి పాలేటి శ్రీను, కరవది సర్పంచి దేవరపల్లి కోటేశ్వరరావు, మన్నే శ్రీను, ఐటి విభాగం నాయకులు మహేష్, మదన్, చక్రపాణి, శేషయ్య, సుధాకర్ ఉన్నారు. అనంతరం వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చుంచు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన కమ్మ సురేష్ పలువురు వైసిపి నాయకులు, వైసిపి ఒంగోలు నియోజ కవర్గ ఇన్‌ఛార్జిచుండూరి రవిబాబును ఒంగోలులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్లపట్టాలు ఇవ్వాలని ధర్నా


మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ వర్కర్స్ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఒంగోలు నగరం 8వ డివిజన్ పరిధిలోని తూర్పుకమ్మ పాలెం, ధారావారి కుంట పరిధిలో నివసిస్తున్న మున్సిపల్ వర్కర్లకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సర్వే నెంబర్ 23లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న మున్సిపల్ పారిశుద్యకార్మికులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై గత 20 ఏళ్లుగా, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చుట్టూ తిరుగుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు నివసించే ప్రభుత్వ భూమి నివాస యోగ్యమైనప్పటికీని పట్టాలు మంజూరు చేయటంలో ప్రభుత్వం అలసత్వం చేస్తుందని ఆరోపించారు. జీవో నెంబర్ 30 ప్రకారం కార్మికులకు తక్షణం ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. నగర ఉపాధ్యక్షుడు తంబి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల నివసిస్తున్న ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి పరచాలని కోరారు. అనంతరం తహశీల్దారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ కాలనీవాసులు కె.మోహన్ రావు, బుట్టి రామయ్య, కె.కాశయ్య, కె.కోటమ్మ, మరియమ్మ, ఆదెమ్మ, కె.మాధవరావు, బి.అంజి, కె.బాలకష్ణ ,ప్రభుదాస్, రవి ,బి.కోటేశ్వరరావు,వర్ల బాబు, ఎస్.మోష,బుల్లెమ్మ, యాకోబు, ఏసు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని ధర్నా


మాట్లాడుతున్న పి. కల్పన

ప్రజాశక్తి ఒంగోలు సిటీ

గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఒప్పందం మేరకు వేతనాలు పెంచుతూ జీవోలు విడుదల చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఒంగోలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.కల్పన మాట్లాడుతూ అంగన్‌వాడీలు గతంలో 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం కనీస వేతనం అమలు చేయాలన్నారు. సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు అతి తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకను గుణంగా కనీస వేతనం రూ. 26, 000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని , మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న టిఎలు, డిఎలు మంజూరు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీచేయాలన్నారు. ఎస్..స్వామి రెడ్డి మాట్లాడుతూ అంగన్ వాడీలపై పనిభారాన్ని తగ్గించాలన్నారు. అర్హులైన ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం సిడిపిఒ బి.హేనసుజనకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.పద్మ, కె.ఎమిమా నాయకులు కెవి. సుబ్బమ్మ, నిర్మల ,పద్మ, శేషమ్మ ,సంధ్య ,జ్యోతి రాజేశ్వరి, శోభ ,శ్రీదేవి, గౌసియా, కవిత, స్టెల్లా ,జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.


జేసీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి హామీ పనుల్లో 50 శాతం కూలీలకు కేటాయించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఉపాధి హామీ పనులు కాంట్రాక్టర్లకు లకు ఇవ్వకూడదన్న హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరింది. స్పందన కార్యక్రమంలో ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన రవికుమార్ యాదవ్ ,బెస్తవారిపేట జడ్‌పిటిసి బండ్లమూడి వెంకటరాజు,ఆర్‌టిఐ విభాగం గిద్దలూరు అధ్యక్షుడుఏ రావిపాటి రమేష్ రెడ్డి,జిల్లా మైనారిటీ నాయకులు షేక్ నాసర్ వలి,వైసిసి స్టూడెంట్ విభాగం జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్,జిల్లా సెక్రటరీ బోయపాటి రామకష్ణ,ఏడుకొండలు జేసీ కలిసి ఈ మేరకు కలసి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ చట్టం 2005 'ప్రకారం క్రింద 50 శాతం పనులు కూలీలతో చేయించాలని ఉందన్నారు. ఆచరణలో అది అమలు కావడ లేదని తెలిపారు.చట్ట ప్రకారం గ్రామసభ అమోదం మేరకు కూలీలతో పనులు చేయించాన్నారు. అయితే అధిక శాతం పనులు యంత్రాలతో, ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామసభల ఆమోదం లేకుండానే తమ ఇష్టానుసారం తమకు నచ్చిన వారితో, ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేత పనులు చేయిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయంపై తాము కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. యంత్రాలతో పనులు చేయించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పిచ్చినట్లు వారు జేసీ దష్టికి తెచ్చారు. యంత్రాలతో నిర్వహిస్తున్న పనులు నిలుపు చేయాలని,కూలీలకు పని కల్పించాలని జేసీని కోరారు. హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు చూపాలని వారు కోరారు. స్పందించిన జేసి రోణంకి గోపాలకష్ణ, డుమా ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు హైకోర్టు తీర్పు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఇదే విషయమై ఎంపిడిఒలను జేసి ఆదేశించారు.

జీవన్ భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేర్నమిట్టకు చెందిన దళిత యువకుడు చింతగుంట్ల జీవన్ హత్య కేసులో భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం, నెలవారీ పింఛన్, రిలీఫ్ రూ.8.25 లక్షలు మంజూరైంది. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. జీవన్ హంతకుల కోసం జరిగినన్ని ఆందోళనలు మరే కేసు కోసం జరగలేదు. పోలీసులు హంతకుల్ని అరెస్టు చేయకుండా రాజకీయ నాయకులు అడ్డుపడ్డారు. దళిత నేత నీలం నాగేంద్రరావు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐదేళ్ల పాటు కలెక్టర్లు, ఎస్పిలను కలిశారు. చివరకు పోలీసులు హంతకులను పట్టుకోలేమని తేల్చి, కేసును అన్ డిటెక్ట్ చేశారు. అన్ డిటెక్ట్ కేసుల్లో సైతం బాధితులకు రిలీఫ్, రీహాబిలిటేషన్ కల్పించాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లారు. నీలం నాగేంద్రరావు మొండిగా పట్టుబట్టి అధికారులకు రూల్ పొజిషన్ చెప్పి జీవన్ భార్య బిడ్డలకు రిలీఫ్ వచ్చేలా చేయటంతో ఐదేళ్ళ పోరాటం సుఖాంతమైంది. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం నాగేంద్రరావు వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, దుగ్గిరాల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వార్డుకో వారం కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ గంగాడ సుజాత 14వ డివిజన్‌లో సోమవారం పర్యటించారు. ఆ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాను పరిశీలించారు. పనుల పురోగతి గురించి కార్పొరేషన్ అధికారును అడిగి తెలిపారు. డివిజన్‌లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాను పర్య వేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చింతపల్లి గోపి, టిడిపి నగర అధ్యక్షుడు కొటారి నాగేశ్వర రావు, స్థానిక టిడిపి బెజవాడ ఆంజనేయులు, శానిటేషన్ సూపర్ వైజర్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి



కరపత్ర ప్రచారం చేస్తున్న రైతు సంఘం, సిపిఎం నాయకులు అంజయ్య

ప్రజాశక్తి - దొనకొండ

పశ్చిమ ప్రకాశం ప్రజల ఆశాజ్యోతైన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ఈ ఏడాది ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించి మొదటి టెన్నల్ ద్వారా నీరు విడుదల చేయాలని రైతుసంఘం నాయకులు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రైతులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామాల్లోని 17వేల ఎకరాల సాగుభూమికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే వస్తాయని అన్నారు. రాష్ట్రంలోనే ఎంతో వెనుకబడిన దొనకొండ ప్రాంతానికి వెలిగొండ ద్వారా సాగు, తాగునీరు రావటం, భూగ ర్భజలాలు పెరుగుతాయని అన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు వెలిగొండ ద్వారా నీరందించవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారన్నారు. ప్రాజెక్టు శంఖుస్థాపన చేసి 30ఏళ్లు గడుస్తున్నా వైసీపీ, తెలుగుదేశం, కాంగ్రెస్‌లు ప్రచారం, ఓట్లకోసం ఉపయోగించుకోవటం తప్పా నిధులు కేటాయించి పూర్తి చేసి సాగునీటికి విడుదల చేయాలనే చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా తెలుగుదేశం ప్రభుత్వం స్పందించి ఈ బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి మొదటి టెన్నల్ నుండి నీరు విడుదల చేయాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న దొనకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో రాయబారం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొండబోయిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దాసరి కోటే శ్వరరావు, మట్టి కొండయ్య, మేకల దావీదు, నరసింహారావు, బత్తుల బ్రహ్మయ్య, మల్లెల చిన్నకాశిరెడ్డి, యగ్గోని కోటేశ్వరరావు, జమ్మలమూడి పేతురు, పగిడిపోగు యోహను, మోడి శ్రీను, మాలపోలు జల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ లలిత్‌సాగర్‌కు టైమ్స్ ఐకానిక్ హెల్త్‌కేర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కడియాల లలిత సాగర్

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్రంలోనే యూరాలజీ వైద్యవిభాగ సేవలందించడంలో టాప్ 5 కిడ్నీ సర్జన్‌గా డాక్టర్ కడియాల లలితసాగర్ నిలిచారు. అందుకుగాను టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డును ఆయన దక్కించుకున్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఐకానిక్ లీడర్ హెల్త్ కేర్ పేరిట అత్యుత్తమ వైద్య సేవలందించిన వైద్యులకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతేక ప్రతిభావంతులను ఎంపిక చేసి అవార్డులు అందజేస్తుంది. ఇందులో భాగంగా టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్-2025ను ఆయన అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడమనేది యూరాలజీ వైద్య విభాగం పట్ల ఆయన అంకిత భావం, నైపుణ్యం, నిబద్ధతకు గుర్తింపుగా చెప్పారు. వైద్య రంగంలో కిడ్నీ సర్జన్‌గా సేవలందించడంలో నాణ్యతను మెరుగు పరచడానికి ఆయన చేసిన ప్రయత్నాలను ప్రశంసించారు. అవార్డు స్వీకరించిన డాక్టర్ కడియాల లలితసాగర్ మీడియాతో మాట్లాడుతూ పలువురు వైద్య ప్రముఖుల సమక్షంలో టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా అందుకోవడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం హయాంలోనే వైద్యులకు తగిన ప్రోత్సాహం కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. అందుబాటులో లేని ఖరీదైన వైద్యాన్ని కూడా తక్కువ ఖర్చుతో అందించాలనే తన లక్ష్యానికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సమర్ధ నాయకుడైన నారా లోకేష్‌లే స్ఫూర్తిగా తీసుకుని పని చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు సాగర్ సతీమణి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వైద్యరంగంలో అద్భుతమైన గుర్తింపును తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె ఎన్‌డిఎ కూటమి ఇన్‌చార్జిగా కూడా పని చేస్తున్నారు. అవార్డు స్వీకరణలో ఆయనతో పాటు నాయన సతీమణి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, కుమారులు కడియాల అక్షయ్‌నంద, అభయ్‌వర్ధన్ ఉన్నారు.

భైరవకోనలో మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న భైరవకోన ఇఒ వంశీకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనలో మహాశివరాత్రి పండుగ ఏర్పాట్లను ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు, ఇఒ వంశీకృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. మహాశివరాత్రికి భైరవకోనకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జలపాతం వద్ద అన్నదానాలు నిర్వహించే ప్రదేశాలు క్యూ లైన్‌లు, త్రాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొండ కింద భాగం నుండి దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు అధికారులతో సమీక్ష

మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా భైరవకోనలో అధికారులతో కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు ముప్పాళ్ళ శ్యాంసుందర్‌రాజు, ఇఒ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. హెూమ్ డిపార్ట్మెంట్, రెవెన్యూ, పంచాయతీరాజ్, హెల్త్, విద్యుత్, ఆర్‌టిసి తదితర శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.

తరగతి గదుల పనుల పరిశీలన



విద్యార్థుల ప్లేట్లో భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి - కనిగిరి

మండలంలోని కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, హాస్టల్ భవన నిర్మాణ పనులను శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. భవనాలు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్లేట్లో భోజనం రుచి చూసి నాణ్యత తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. రుచికరంగా భోజనం పెట్టాలని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. పాఠశాలకు, తల్లి, దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న గుదే వెంకటేశ్వర్లు

డయాలసిస్ కేంద్రం అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - కనిగిరి

ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం కనిగిరి ప్రభుత్వ వైద్య శాలలో డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి రూ.25వేల విరాళాన్ని మండలంలోని చల్లగిరిగలకు చెందిన గుదే వేంకటేశ్వర్లు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో దొడ్డిచింతల సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి, గోడి ప్రభాకర్, ఎంఆర్‌పిఎస్ ఇంచార్జ్ రావినూతల కోటయ్య, కూడారి రామ్మోహనరావు, ముక్కు శ్రీరాములురెడ్డి, గుదే నారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

పామూరు : కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి రూ.25వేల ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నాడు. కనిగిరి జనని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా టిడిపి యువ నాయకులు షేక్ షంషఉర్ సోమవారం నగదు అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకుడు యారవ శ్రీనివాసులు, ఎస్‌కె నాయబ్ రసూల్, ఎస్‌డి అమీర్ బాబు, గౌస్ బాషా పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న పామూరు టిడిపి నాయకులు



చిన్నారులను ఆశీర్వదిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

చిన్నారులకు 'బూచేపల్లి' ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక బజాజ్ షోరూం ప్రోప్రైటర్ అలవల అంజిరెడ్డి సతీమణి అనంతలక్ష్మి మనవళ్లు, మనవరాళ్లు నూతన వస్త్ర బహుకరణ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు బంధువులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మండలంలోని కొర్లమడుగు గ్రామంలో చాగంటి శివకోటిరెడ్డి వివాహ వేడుకల్లో జిల్లా పరిషత్‌చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంఎల్‌ఎ, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు.



అజోలగడ్డి నాచుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అజోల దాణాపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-తాళ్ళూరు

అజోల ఇది ఒక రకమైన నాచు మొక్క. నీటిపై తేలియాడుతూ వరి పొలాల్లోనూ లోతులేని జలావాసాల్లోనూ పెరుగుతుంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. అధిక మాంసకృతుల ఉండి కాండం భాగం తక్కువగా ఉండటంతో పశువులు త్వరగా జీర్ణం చేసుకోగలవని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. కోళ్లకు మంచి దాణాగా, అజోను ఇతర దాణాలతో కలిపి గాని, నేరుగా గాని ఉపయోగించుకోవచ్చునని స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం పశు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ లీలాకృష్ణ తెలిపారు. మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న అజోలా దాణా పెరుగుదలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్ పి అనంతలక్ష్మి, కోటి రత్నం, గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గోకులం షెడ్లు పరిశీలిస్తున్న ఎపిఒ శ్రీనివాసనాయక్

గోకులం షెడ్లను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

పశు పోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని ఉపాధిహామీ పథకం ఎపిఓ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని అయిలూరివారిపల్లి, తుంగోడు గ్రామాల్లో గోకులం షెడ్లను ఆయన సోమవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో గోకులం షెడ్లను నిర్మించాలని సూచించారు. తుంగోడు గ్రామంలో పూర్తయిన గోకులం షెడ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో మంజూరైన గోకులం షెడ్లు అన్నింటినీ వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు అల్లూరయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన


సంతమాగులూరులో అర్జీ అందజేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి-రేపల్లె

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలిని, గ్రాట్యుటీ అమలుచెయ్యాలని, మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ధర్నాలు చేపట్టినా నేపథ్యంలో రేపల్లె ఐసీడీఎస్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేసి సిడిపిఓ ఎం.సుచిత్రకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ మాట్లాడుతూ మన రాష్ట్రంలో పేదగర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీ వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకి వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కొరకు 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలై లో వేతనాలు పెంచుతాము, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తానని మినిట్స్ ఇచ్చారు. ప్రధానంగా అంగన్వాడీలకు కనీసవేతనం రూ.26000/- లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్. కృష్ణకుమారి కే.రత్నకుమారి,నిర్మల జ్యోతి, డి.జ్యోతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి సిఐటియు నాయకులు కెవి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు: ఐసిడిఎస్‌కి బడ్జెట్‌లో నిధులు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హను మంతరావు డిమాండ్ చేశారు. సోమవారం సంతమా గులూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు రకరకాలుగా పెట్టుబడులు పెట్టి సెం టర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. వేతనాల పెంపుకు, తదితర సమస్యల పరిష్కారం కొరకు 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె ని ర్వహించామన్నారు. గత వైసిపి ప్రభుత్వం 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చిందన్నారు. అయినా నేటి వరకు కూడా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అనంతరం డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని సిడిపిఓ డి సుధకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తాన్ బి , శ్రీదేవి, మల్లేశ్వరి, ఎస్తేరా రాణి, కోటేశ్వరి, తదితర అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

వేటపాలెం: అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ డిమాండ్ చేశారు. సోమవారం వేటపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల సిఐటియు పట్టణ అధ్యక్షులు, వేటపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం వసంతరావు, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పి.ప్రమీల, కార్యదర్శి ఎ.బ్యూలా, సుజీవన, సెక్టార్ లీడర్స్, పద్మ, శిరీష, పద్మావతి, బుల్లేమ్మాయి, జ్యోతి, లక్ష్మి, సులోచన, అనిత, జ్యోతి, భులక్ష్మి, నిర్మల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలిని,గ్రాట్యుటీ అమలు చెయ్యాలని, రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ధర్నాలు చేపట్టినా నేపథ్యంలో పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద సిడిపిఓ అనసూయకి సమస్యలుతో కుడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, బేబిరాణి, రజని తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరు: అంగన్వాడీలకు వేతనాలు పెంచి మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చే జీవో ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.సుధాకర్, యూనియన్ నాయకులు బి. రమాదేవిలు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలకు బాలింతలకు చిన్నపిల్లలకు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తున్నప్పటికి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి నాగరాజు, పి మనోజ్, రూపా రాణి, చీకటి దుర్గ , అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు , అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

మురళీ సుధాకరరావుకు సన్మానం

ప్రజాశక్తి-అద్దంకి

అన్నదానం, రక్తదానం, వైద్య సహాయం, సాహిత్య ప్రోత్సాహం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మురళీసుధాకరరావును సోమవారం ఘనంగా సన్మానించారు. అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగిన సభకు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సత్కార కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వారణాసి రఘురామశర్మ, రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సంస్థ కార్యదర్శి కె.వి.పోలిరెడ్డి, గాడేపల్లి దివాకర దత్తు, డి.వి.యం.సత్యనారాయణ చుండూరి సేవలను కొనియాడి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండకావూరి కుమార్, కూరపాటి రామకోటి, ఆర్.రాజశేఖర్, కడియం పాపారావు, పి.సి.హెచ్.కోటయ్య, ఆర్.వి.రాఘవరావు, మలాది శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-రేపల్లె

మహాశివరాత్రి సందర్భంగా అరవపల్లి గ్రామంలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద జరిగే తిరునాళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రేపల్లె తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తిరునాళ్ల జరిగే ప్రాంతాలను దేవాదాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఎస్సై రాజశేఖర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి అప్పలాచారి, పశువైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రవీణ్ ,శానిటరీ ఇన్స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చీరాల

రాజకీయ పార్టీలకు అతీతంగా బాధితుల పక్షాన ఉండి వారి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చీరాల నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకున్న వారిలో 12 మంది లబ్ధిదారులకు గాను సుమారు రూ.13,17,906 విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా ఎల్ఓసి ద్వారా 6 మందికి రూ.11,78,635 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పేదల మీద కక్షగట్టి రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న సీఎం సహాయ నిధులను అర్ధాంతరంగా నిలిపివేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వల్ల వేలాది కుటుంబాలు మానసిక క్షోభకి గురి కావడమే కాకుండా హాస్పిటల్‌కి రుణాలు కట్టలేక ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రజలు చిన్నచిన్న ఖర్చులకు కూడా హాస్పటల్‌కు చెల్లించలేక అప్పులు చేసి రోడ్డున పడిన కుటుంబాలు ఉన్నాయి. ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా చాలా దారుణంగా చూశారు కాబట్టే ఆనాటి ప్రభుత్వం కేవలం 11 సీట్లకే పరిమితమయ్యింది. తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం చంద్రబాబు హయాంలో మరల పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని దీనికి ఉదాహరం. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు గుమ్మడి ఏసురత్నం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరాటే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-చెరుకుపల్లి



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ 2025లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సోమవారం విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలలో యెల్లో బెల్ట్ హోల్డర్స్‌గా ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో పాఠశాల విద్యార్థులు కె.మోహిత్, ఎం.అరవింద్, ఎం.సాత్విక్, ఎం.రోషన్, ఎ.గౌతమ్, వై.జైదీప్, వావ్ రేవంత్, ఎస్.మోక్షజ్ఞ, గో శ్రీచక్రధర్, పి.మోహన్ గౌతమ్, ఎం.లోకేష్‌లు అత్యుత్తమ ప్రతిభ కనిపరిచారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులను చైర్మన్ పైనం ఏడుకొండల రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ కరాటే కోచ్ పసం దుర్గా ప్రసాద్ శిక్షణతో విద్యార్థులు పతకాలు సాధించగలిగారని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని విద్యాతపాటు ఆసక్తి కలిగిన క్రీడలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు


సిఐ శేషగిరిరావును సన్మానిస్తున్న ఐక్యవేదిక నాయకులు

సిఐ శేషగిరిరావుకు సన్మానం

ప్రజాశక్తి-చీరాల

ఇటీవల రిపబ్లిక్ డే సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి మరియు జిల్లా ఎస్పీ తుషార్ డూడి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ సిఐగా ప్రశంస పత్రాన్ని అందుకున్న సందర్భంగా ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సోమవారం సాయంత్రం రూరల్ సిఐ శేషగిరిరావును సోమవారం పోలీస్ స్టేషన్ మర్యాదపూర్వ కంగా ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ సిఐగా శేషగిరిరావు ఏ స్టేషన్‌లో పని చేసి నా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరికీ న్యాయం చేస్తూ అధికారులు ప్రజల మన్ననలను పొందారు అన్నారు. భవి ష్యత్తులోను కూడా ఇలానే మంచి సేవలు అందించి గొప్ప అవార్డులు ప్రశంసలు అందుకోవాలని ఆశిస్తున్నామని తెలి పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు జగన్నాథం యోహాను, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పెదపూడి విజయ్ కుమార్, పుట్టంరాజు కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఏపీవో సంతోషం

పని ప్రదేశంలో నాలుగు గంటలు ఉండాలి

ప్రజాశక్తి-పంగులూరు

ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో కనీసం నాలుగు గంటలు పనిచేయాలని, పని పూర్తి వరకు అక్కడే ఉండాలని పంగులూరు మండల ఏపీఓ కె.సంతోషం అన్నారు. సోమ వారం మండలంలోని ఆరికట్లవారిపాలెం, బూదవాడ కళ్ళం వారి పాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడుతూ, ఉపాధి కూలీలు పనికి వచ్చిన తర్వాత కనీసం నాలుగు గంటల పాటు పని ప్రదేశంలో ఉండాలన్నారు. పని కూడా ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేయాలని, అప్పుడే కూలీ 300 రూపాయలు వేయటానికి అవకాశం ఉంటుందని చెప్పా రు. ఈ సందర్భంగా కూలీలకు వేతన ధరల గురించి ఆమె తెలియజేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొద్దిపాటి ఉన్నప్పటికీ ఉపాధి కూలీలు ఉపాధి హామీ పనికి రావాలని ఎక్కువమంది వచ్చి పని సక్రమంగా చేసి మంచి కూలిని పొం దాలని ఆమె తెలిపారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, కూలీలకు పని పట్ల అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కావ్యను ఏపీవో సంతోషం కోరింది.

వరరాజుబాబుకు సంతాపం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వేమూరు నియోజకవర్గం, కొల్లూరు మండలం, చినపులి వర్రు గ్రామ వైసీపీ నాయకులు మాతంగి వరరాజుబాబు (59) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈయన పార్థివ దేహానికి మాజీ మంత్రి మేరుగ నాగార్జున తనయుడు వైసిపి బాపట్ల యువజన విభాగం అధ్యక్షులు మేరుగ చందన్ నాగ్ నివాళి అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ ధారా రవికిరణమయ్య, నాయకులు మాతంగి రత్నబాబు, పలువురు వైసిపి నాయకులు, తదితరులున్నారు.



సఖీ వన్ స్టాప్ సెంటర్ సందర్శిస్తున్న ఎస్‌పి తుషార్ డూడి

అతివలకు అండగా 'సఖీ వన్ స్టాప్'

బాపట్ల జిల్లా ఎస్‌పి తుషార్ డూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అతివలకు అండగా 'సఖి వన్ స్టాప్ సెంటర్' ఉంటుందని ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం గేట్ సమీపంలోని సఖివన్ స్టాప్ సెంటర్‌ను ఎస్‌పి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, అక్రమ సంబంధాలు, ఈవ్ టీజింగ్, బెదిరింపులు, మహిళల అక్రమ రవాణా, సోషల్ వెబ్‌సైట్ ద్వారా జరిపే నేరాలు, మాదకద్రవ్యాలకు లోనై హింసించడం, ఇంటి నుంచి గెంటేయడం, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం తదితర ఫిర్యాదులపై మహిళలు నిర్భయంగా 181కు కాల్ చేయాలని తెలిపారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సఖీ కేంద్రంలో సోషల్ కౌన్సెలర్, లీగల్ కౌన్సెలర్లు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అవసరమైతే పోలీసుల సహాయం కూడా తీసుకోవచ్చునని తెలిపారు. అతివల సమస్యల సత్వర పరిష్కారానికి, రక్షణ కల్పించేందుకు 2024 సెప్టెంబర్ నెలలో బాపట్ల పట్టణంలో ఉప్పరపాలెం గేట్ సమీపంలో "సఖి వన్ స్టాప్ సెంటర్" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో పోలీసు, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ విభాగాలకు చెందిన సిబ్బంది ఉంటారన్నారు. మహిళలకు ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించవచ్చునన్నారు. మహిళలు ఒంటరిగా ఉండి ఆశ్రయం కావలసి వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 181కు కాల్ చేసి సంప్రదిస్తే తక్షణం 'సఖి వన్ స్టాప్ సెంటర్' లో ఆశ్రయం కల్పిస్తారన్నారు. గరిష్ఠంగా 5 రోజుల వరకూ ఆశ్రయం కల్పిస్తారని తెలిపారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వరకూ 32 కేసులను పరిష్కరించవచ్చుని తెలిపారు. సహాయం కోసం వచ్చిన బాధిత మహిళల సమస్యలు పరిష్కరిస్తున్న విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ రాంబాబు, 'సఖి వన్ స్టాప్ సెంటర్' అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టండి

జాయింట్ కలెక్టర్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కమిటీ వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి.బ్రహ్మం డిమాండ్ చేశారు. పార్వతిపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రీవెన్స్‌లో సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకష్ణను జిల్లా కమిటీ నాయకులు సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. ఇటీవల కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జర్నలిస్టులను దుర్భాషలాడినట్లు తెలిపారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షులు, ఏ.వెంకంపేట గ్రామానికి చెందిన గుల్ల వేణుగోపాల నాయుడు దాడి చేసినట్లు తెలిపారు. అంతేకాక చంపుతామని బెదిరించారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వార్త రాసినందుకు ప్రజాశక్తి విలేకరిపై దాడి జరిగిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకు రావడానికి జర్నలిస్టులు వార్తా కథనాలు రాస్తుంటారన్నారు. ఎంతో నిజాయతీగా వ్యవహరించే జర్నలిస్టులపై దాడులు జరగడం శోచనీయమన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు అటాక్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 25 ప్రకారం గ్రామీణ ప్రాంతాలలోని జర్నలిస్టులకు 3 సెంట్లు, పట్టణ ప్రాంత జర్నలిస్టులకు 2 సెంట్లు కేటాయిస్తామని చెప్పిందన్నారు. జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. అక్రిడిటేషన్ కార్డులు గడువు నెలాఖరుతో ముగుస్తుందని, ఇప్పటి వరకు కమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించి జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.భక్తవత్సలం, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు, జర్నలిస్టులు మీసాల శ్రీనివాస్, ఎ.సువర్ణ రాజు, ఎల్.రాజు, వి.కోటయ్య సురేష్, కెమెరా మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ప్రజాశక్తి ఫొటోగ్రాఫర్ టి.బాలాజీ కుమార్, మైకేబుల్ కెమెరామెన్ శ్రీనివాసాచారి, జర్నలిస్టులు పాల్గొన్నారు.



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కమిటీ

రేపు ఒఎంసి బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్ : ఒంగోలు నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు మేయర్ గంగాడ సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఆమె కోరారు. నగరపాలక సంస్థ 2024-25 సంవత్సర సవరణ బడ్జెట్, 2025-26 సంవత్సర బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నిత్యావసరాల ధరలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి కోరారు. నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని కోరుతూ ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఐద్వా నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం రమాదేవి మీడియాతో మాట్లాడారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జాతీయ కమిటీ పిలుపుమేరకు గత పది రోజులుగా జిల్లాలోని అనేక ప్రాంతాలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అర్జీలలో సేకరించిన సంతకాలను రాష్ట్ర గవర్నర్ కు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ను కోరినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నని తెలిపారు. ఫలితంగానే నిత్యవసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నాయన్నారు. నిత్యవసర వస్తువుల ధరలకు తోడు కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు అధిక భారాలతో జీవితాన్ని గడపడం కష్టంగా మారిందన్నారు. కుటుంబంలో ధరల భారాలకు మొదట గురయ్యేది మహిళలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఒంగోలు నగర అధ్యక్షురాలు బి.గోవిందమ్మ, నగర నాయకులు రాజేశ్వరి, బి. పెద్ద గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

'జిబిఎస్'పై అవగాహన కల్పించండి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జిబిఎస్)వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధి వ్యాప్తిని ఆరికట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతాల (అభా) నమోదు ప్రక్రియ, గులియన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తిపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణాంతకమైన గులియన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధికి ప్రజలు గురిగాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వసతి గహాలలోని విద్యార్థులకు విస్తతమైన అవగాహన కల్పించాలన్నారు. కోడి పేగులలో ఉండే బ్యాక్టీరియా ద్వారా గులియన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధి మనుషులకు వస్తుందన్నారు. కోడి మాంసం విక్రయించే విక్రయదారులు తగు జాగ్రత్తలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోడి నుంచి తీసే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదన్నారు. జల వనరులు కలుషితమయ్యే ప్రాంతాలలో వాటిని వేయరాదని హెచ్చరించారు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకినట్లైతే మూడు రోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు సచ్చుపడటం, చేతి వేళ్ళు లేదా కాలు వేళ్ల దగ్గర నుంచి స్పర్శ క్రమేపి కోల్పోవడం వంటివి సంభవిస్తాయన్నారు. లక్షణాలు కన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. బ్యాక్టీరియా సోకి వ్యాధిగ్రస్తులైన వారికి ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. గుంటూరు జిజిహెచ్, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

అభా కార్డుల నమోదు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలి

అభా కార్డుల నమోదు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. ఇప్పటివరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 85 శాతం సర్వే పూర్తి అయ్యిందన్నారు. వేటపాలెం, కర్లపాలెం, యద్దనపూడి మండలాలలో ఈ ప్రక్రియ జాప్యంపై అరా తీశారు. సత్వరమే నూరు శాతానికి ఈ ప్రక్రియ చేరుకునేలా మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంఈవోలు, వైద్య అధికారులతో బందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డిసిహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్, డీఈవో పురుషోత్తం, మండలాల నుంచి ఎంపిడిలు, ఎంఇఒలు, సిడిపిఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాంభూపాల్ రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విశిష్ట వ్యక్తిగా భారత ప్రభు త్వం గుర్తించిన రాంభూపాల్ రెడ్డిని ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డివిఆర్.మూర్తి అభినందించారు. భారత ప్రధాని కార్యాలయం ద్వారా జాతీయ స్థాయిలో విశిష్ట వ్యక్తిగా గుర్తింపు పొందిన రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెడ్మాస్టర్ ఎం. రాంభూపాల్ రెడ్డి ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రా ర్ డాక్టర్ హరిబాబులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న సేవలు గురించి విసి అడిగి తెలుసుకున్నారు. టీచర్ స్థాయి నుంచి తన వేతనాన్ని, విశ్రాంత హెడ్మాస్టర్‌గా తన పెన్షను విద్యార్థినులకు కేటాయించడం పట్ల రాంభూపాల్‌రెడ్డిని విసి అభినందనలు తెలిపారు.



రాంభూపాల్ రెడ్డిని అభినందిస్తున్న విసి